# చిత్రభంగము

టెలిఫోన్ మ్రోగుతుంటే, చదివే పేపరు బల్లమీద పడేసి, విసుక్కుంటూ లేచాడు ఆనందరావు. రిసీవరు అందుకున్న మరుక్షణమే ఆనందరావు ముఖం ప్రఫుల్లమైంది. “నువ్వా మూర్తీ! ఎప్పుడొచ్చావు? ఎన్నాళ్ళు లీవు? అందరూ కులాసానా? ఏమిటి విశేషాలు?” అన్నాడు ఆనందరావు గుక్క త్రిప్పుకోకుండా.

“లీవులోనే వచ్చాం, అనుకోకుండా మా తమ్ముడి కూతురు పెళ్ళి కలిసివచ్చినందున అందరం వచ్చాం.”

“సరే, యిక్కడెన్నాళ్ళుంటావ్? మా యింటికి రండి యివాళ, రాత్రి భోజనానికి. సాయంత్రమే రండి. సావకాశముగా మాట్లాడుకుందాం.”

“యివాళే రమ్మంటావ్? రేపో ఎల్లుండో చూద్దాంలే!”

“అట్లాకాదు, యివాళే రండి. యివాళ మా అమ్మాయి పుట్టినరోజు కూడాను. అందరం సరదాగా గడుపుదాం.”

“అయితే తప్పకుండా వస్తాను.”

“వస్తానేమిటయ్యా! మా చెల్లెల్నికూడా తీసుకురా.”

“మీ చెల్లెలుకూడా వస్తే, మా నిరంజన్ ఏమిపాపం చేశాడు రాకపోవడానికి? వాణ్ణికూడా పిలుచుకురానా? ఏమీ అనుకోవుగదా?”

“అనుకోడమెందుకు?”

“ఏమో, నీ కూతురికి యీ పాటికి పెళ్ళీడు వచ్చివుండదూ? నా కొడుకును తీసుకువస్తే నువ్వేమయినా అనుకుంటావేమోనని... !”

ఆనందరావు నవ్వి, "ఓహో ఫరవాలేదు, అనుకున్నా-అనుకోదగ్గ విషయమే; నేను అనుకోదగ్గ వాడినే: తప్పకుండా ముగ్గురూ రండి. ఆరింటికల్లా కారు పంపుతాను, సరేనా!" అని రిసీవరు పెట్టేశాడు.

ఆనందరావూ, రామ్మూర్తీ చిన్ననాటి స్నేహితులు. స్కూల్లో కాలేజీలో ఏడేళ్ళపాటు సహాధ్యాయులు. పై చదువుల కెళ్ళాక, వాళ్ళ అభిమాన విషయాలు వేరైనందున, వాళ్ళ బ్రతుకుబాటలు వేరైనాయి. ఆనందరావు అకౌంటెంటు జనరలుగా వుంటున్నాడు. రామ్మూర్తి పదేళ్ళుగా యఫ్. ఎ. ఓలో న్యూట్రిషన్ ఎక్స్పర్టుగా వివిధ దేశాల్లో తిరుగుతున్నాడు. మిత్రుని రాక తెల్పడానికి యింట్లోకి వెళ్ళాడు. ఆనందరావు భార్య అనసూయ, ఎత్తు తక్కువ మేడమీద కూర్చుని, కూతురి కురులుచిక్కు తీస్తూ, తడియారుస్తున్నది. గంధపొడి కలిసిన సాంబ్రాణి వాసనలు గదంతా అలుము కున్నవి. కూతురు చిత్రాంగద తివాచీమీద కూర్చుని 'లైఫ్' తిరగేస్తూంది.

"అనసూయా! యిది విన్నావా?" అన్నాడు ఆనందరావు.

"ఏదీ? మీరు చెప్తేనా?" అంది అనసూయ. చిత్ర నవ్వింది.

ఆనందరావు, "మూర్తివాళ్ళు సెలవులో వచ్చారట; యిప్పుడే ఫోనుచేశాడు. రాత్రికి వాళ్ళను భోజనానికి పిలిచాను. విందు బాగుండాలి. దగ్గరుండి చేయించు." అన్నాడు.

"ఏ మూర్తిగారండీ?" అంది అనసూయ.

"అదే, మన ఎఫ్. ఏ. ఓ. రామ్మూర్తి." అని తన గదిలోకి వెళ్ళిపోయాడు ఆనందరావు.

అనసూయ మధ్యాహ్నంనుంచీ వంట ప్రయత్నాలు మొదలు పెట్టింది. సలహా లివ్వడానికి చిత్రకూడా వెళ్ళింది! అనసూయ నవ్వుతూ "వచ్చేవాళ్ళు అసలైన ఆంధ్రులు; ఉప్పూ, కారం తినగలవాళ్ళు. వాళ్ళకు నీ నాజూకు వంటలు వద్దులే చిత్రా! నువ్వెళ్ళి కాస్త హాలు, గదులు సర్దిరమ్మ," అని పంపించింది కూతుర్ని.

కారు ముందుసీట్లోంచి దిగిన నిరంజన రావుని మొదట చూచింది అనసూయ. ఆమెలో ఆశ చిగురించింది. అందరూ వచ్చి హాల్లో కూర్చున్నారు. నిరంజన్ ఎదురుగా చూచాడు చిత్రవంక. చిత్ర సూటిగా చూచిందతనివంక. అమెరికాలో చదువుకొంటున్నఅబ్బాయి రంగు రంగుల దుస్తులు వేసుకుంటాడనుకుంది చిత్ర. అతని ధవళ వస్త్రధారణ చూచి ఆశ్చర్యపోయింది. చిత్ర గులాబి రంగు బనారస్ పట్టుమీద బాటిక్ ప్రింటుచీర కట్టుకుంది. అదేరంగు బ్లవుజు వేసుకుంది. ముత్యాలనగలు పెట్టుకుంది. ఆమె జడలోని విరజాజులు పరిమళాలు వెదజల్లుతున్నాయి. ఆమె పెదవులపై మాటిమాటికీ మెదిలే మందహాసాలు చూస్తే గులాబి మొగ్గలు గుర్తుకొచ్చాయి నిరంజన్‌కు. రామ్మూర్తి భార్య సుభద్ర తెచ్చిన పాకెట్ విప్పి చిత్రకు చీర యిచ్చింది పుట్టినరోజు బహుమతిగా.

“ఏకంగా ప్రధానమే పట్టుకొచ్చారే వదినగారు!” అని మేలమాడింది అనసూయ. అందరూ పులిక్కిపడ్డారు. మరుక్షణమే అందరి హృదయాలూ సంతోషంతో నిండిపోయాయి. చిత్రాంగదను చూసిన మధుమూర్తి దంపతులు, నిరంజనరావును చూసిన ఆనందరావు దంపతులు హాయిగా నిట్టూర్చారు.

“మిమ్మల్ని చూసి పదేళ్ళయింది. మీరు రోమ్ కెళ్ళేముందు చూడ్డమే! మీ బాబు చదువు పూర్తయిందా?” అనడిగింది. అనసూయ సుభద్రను. “ఆఁ. కాలిఫోర్నియా యూనివర్శిటీలో పి. హెచ్. డి చేశాడు; ఇంకో ఆరునెలలు ఏదో ట్రెయినింగులో వున్నాడు. అదయ్యాక హవాయి వెళ్తాడు. అక్కడ హనలులూ యూనివర్శిటీలో వుద్యోగం దొరికింది. మీ చిత్ర ఏమి చదువుతోంది?” అన్నది సుభద్ర.

“హోమ్‌సైన్సులోయం. ఏ. చదువుతోంది. యిది చివరి సంవత్సరమే.” అంది అనసూయ. సుభద్ర నవ్వుతూ. “జాగ్రత్త చిత్రా, మీ మామయ్య అంటూంటారు. హోంసైన్సులో పట్టాలుతీసుకున్న ఆడవాళ్ళ చాలామంది చివరకు ‘హోం’ లేకుండా చేసుకుంటారని” అన్నది.

పుట్టినరోజు విందుకాస్తా పెళ్ళిచూపుల వేడుకక్రింద తయారయ్యేసరికి చిత్రకు వుత్సాహమంతా నీరుకారిపోయింది! నిరంజన్ మాట్లాడకుండా ఆమెను చూస్తూండడము నచ్చలే దామెకు. పెద్దవాళ్ళు మాటల్లో వున్న సమయంలో మెల్లగా తనగదికి జారుకుంది చిత్ర. సాయంత్రం చల్లగానే వున్నా, పైన ఫాన్ తిరుగుతూనే వున్నా, చిత్ర మనసుకు ఉక్కపెట్టి నట్లుగా వుంది. కాసేపు ఆ పత్రిక యీపత్రిక తిరగేసింది. చిరాగ్గా లేచి దుస్తులు మార్చుకుంది. తెల్లని ఫుల్‌వాయిల్ చీర కట్టుకుని 'అమ్మయ్య' అనుకుంది. నిరంజన్ ఏమీతోచక అల్మారాలోంచి ఒక్కో పుస్తకం తీసి చూస్తున్నాడు. భోజనాలవేళ అయ్యేసరికి అనసూయ చిత్రను పిలిచి, బల్ల మీద అన్నీ పెట్టించి, "పిలువమ్మా." అంది. చిత్ర కట్టుకున్న తెల్లచీర చూసి, అనసూయ, సుభద్ర తెల్లబోయారు. భోజనాలప్పుడు చిత్ర మెదలకుండానే వుండిపోయింది. మగవాళ్ళంతా ఒక ప్రక్క కూర్చున్నారు. నిరంజన్‌కు ఎదురుగా చిత్ర కూర్చోవలసి వచ్చింది. ఆనందరావు భోజన ప్రియుడు, స్నేహితుడి ప్లేటును చూస్తూ- "అది ఏమిటోయ్ అంత తక్కువ వడ్డించుకున్నావ్? నీకు ఫ్రయిడ్‌ఫిష్ యిష్టమేగా, మరిరెండు ముక్కలు వేసుకో." అన్నాడు.

రామ్మూర్తి "ఆనందూ, నాపేరు చెప్పుకుని ఆ రెండుముక్కలూ నువ్వే వేసుకో." మని గుప్పెడన్నంలో గోంగూరపచ్చడి కలిపి అనసూయతో "అమ్మాయీ! లోపల పాల మీగడ వుంటే తెమ్మను; లేకపోతే వెన్న యినాసరే; నాకు గోంగూరన్నంలో నెయ్యి బాగుండదు." అన్నాడు. వంటమనిషి ప్లేటులో మీగడ తెచ్చాడు. తృప్తిగా రెండు ముద్దలు తిన్న రామ్మూర్తి "దేశాలుపట్టి తిరిగే తెలుగువాడు; మన దేశవాళీ రుచుల కోసం ఎంతగా మొహంవాచిపోతాడో నీకు తెలీదోయ్." అన్నాడు స్నేహితుడితో. సుభద్ర నవ్వుతూ "మీ అన్నయ్య రుచులు అడక్కండి వదినా! ఎవరేనా విన్నా నవ్వుతారు. నిన్నమొటుకు నిన్న, నాచేత మానెడు వులవలు వుడకేయించి వులవచారు పెట్టించుకున్నారు." అన్నది. నిరంజన్ మాత్రం అన్నం కొద్దిగా తినడం, కూరలతోనూ, పండ్లతోనూ కడుపు

నింపుకోడం గమనించింది చిత్ర. 'చిన్నప్పటినుంచీ విదేశాల్లో పెరిగిన వాడయ్యే,' అనుకుంది. డైనింగ్‌టేబిలుమీద అలంకరణగా పెట్టిన కాయగూరలు చూచి "యివన్నీ ఎవరు చేశారు," అనడిగింది సుభద్ర.

"అదంతా చిత్రపనే; నాకు చేతకావు." అంది అనసూయ. ఒక సొరకాయ నిలువుగా గాటుపెట్టి తిమింగలంలాగా చెక్కింది. ఇంకో సొర కాయ నిలువుగా చీల్చి పడవలాగ అమర్చింది. రెండు కారెట్లను మనుష్యు ల్లాగ చెక్కి పడవలో అమర్చింది. ఆట్టే గరుకుతేలని లేతరంగు కాకర కాయల తొడిమలకు పండు మిరపకాయలు గుచ్చి రామచిలుకల్లాగా చేసింది. ఒక తియ్యగుమ్మడికాయ సగానికి కోసి, అంచుచుట్టూ నగిషీలు చెక్కి, చిన్న టమోటాలు, రాచవుసిరికాయలు అందంగా పేర్చి, అంచు చుట్టూ పుల్లలు గుచ్చి, వాటికి పచ్చి మిరపకాయలు, పండు మిరపకాయలు మార్చి మార్చి గుచ్చింది. అక్కడక్కడా తురిమిన కొబ్బరి, తుంచిన కొత్తిమీర, పుదీనా ఆకులు చల్లింది. చూడముచ్చటగావున్న ఆ గుమ్మడి ముక్క, కేండిల్సు గుచ్చిన కేక్‌లాగే వుంది. అనసూయ మురిపెంగా చిత్రవంక చూస్తూ "ఎక్కడ నేర్చుకున్నావమ్మా," అంది. చిత్ర నవ్వి వూరుకుంది. "ఎంత బాగుంది!" అని అనకపోయినా "యిది బాగుంది," అనికూడ నిరంజన్ అనకపోవడం చిత్రకు బాధగా తోచింది.

ఆ రాత్రి వెళ్ళేముందు నలుగురూ కాసేపు గుసగుసలాడుకున్నారు. రెండోరోజున ఆనందరావు భార్యతో "చిత్రను అడిగావా?" అన్నాడు. అనసూయ నవ్వి "అడిగాను, విని వూరుకుంది. యిష్టం లేకపోతే ఒక్క ఛీత్కారమైనా చేసేదే!" అన్నది. సుభద్ర కొడుకును పిలిచి "నాకు, మీ నాన్నగారికీ ఆనందరావుగారి అమ్మాయి నచ్చింది. నీకు బాగుందా?" అనడిగింది. నిరంజన్ సంతోషాన్ని అణచుకుంటూ "ఔనమ్మా, నాకూడా నచ్చింది." అన్నాడు. వారంరోజులు తిరక్కుండానే ఒక మంచిరోజు చూసుకుని, వూళ్ళో పదిమంది పెద్దమనుషుల్ని పిలిచి తాంబూలాలు పుచ్చుకున్నారు. నిరంజన్‌కు ట్రెయినింగు పూర్తయ్యాక,

మళ్ళీ అందరూ ఇండియాకు వచ్చి పెళ్ళి జరిపించి కోడలును కూడా తీసి కెళ్ళేటట్లు నిర్ణయించారు. యీ లోపల చిత్ర చదువుకూడా పూర్తవు తుందనుకున్నారు. సుభద్ర ఒక విలువైన చీర, రవ్వల ఉంగరం కోడలుకు పెట్టి ప్రధానం జరిపించింది. ఆ తరవాత కొద్ది రోజులకే రామ్మూర్తి కుటుంబము విదేశాలకు వెళ్ళిపోయారు.

చిత్ర మామూలుగా కాలేజికి వెళ్ళసాగింది. ఎప్పుడైనా తీరిగ్గా వున్నప్పుడు, తనకు ప్రధానం జరిగిన సంగతి గుర్తుకు వచ్చేది-నిరంజన్ మెదిలేవాడు ఆమె కళ్ళముందు. ఆమెమనసు పొంగిపోయేది కాదు. అతి సామాన్యమైన నిరంజన్ రూపం ఆమె తరుణ హృదయాన్ని స్పందించ లేక పోయింది. ఉసూరు మనేది. నెలరోజుల తర్వాత ఓనాడు చిత్ర కాలేజినుంచి యింటికి రాగానే అనసూయ, అమెరికానుంచి వచ్చిన జాబు కూతురికిచ్చింది సంబరంగా. ఆశ్చర్యపోయింది చిత్ర. తన గదిలోకి వెళ్ళి తలుపు లేసుకుని వుత్తరం విప్పింది చిత్ర.

పనిలో ఏకాగ్రత తప్పడమనేది నే ననుభవించలే దింతవరకు! కాని నిన్ను చూచి వచ్చాక తరచు పుస్తకం తెరిస్తే నువ్వే కనబడు తున్నావు. మైక్రోస్కోపులో నువ్వు, టెస్ట్‌ట్యూబ్‌లో కనపడేది నువ్వు! ఎట్లా మారిపోయాను నేను? నాకు తెలియదు మరి. నీ కేమనిపిస్తోంది? జాబు వ్రాస్తావా?

నీ నిరంజన్.

ఇంగ్లీషులో ఒక పేజీలో మధ్యన ఆరు పంక్తులజాబు చదువు కున్న చిత్రకు ఆశ్చర్యమయింది.

"ఏమి టీ మనిషి? న న్నత డెరిగింది మూడుగంటల సేపు. నాతో మాట్లాడింది నాలుగు మాటల్లేవు. నా చదువు, నా అభిరుచులు అతనెరుగడు. నాపై ప్రేమ పొంగుకు వచ్చిందంటే నే నెలా నమ్మను? నే నేమి పసి పిల్లనా, ఎవరికో నేనంటే యిష్టమని తెలిసి పొంగిపోవడానికి? నన్నేమి తెలిసి ప్రేమించగలిగాడు? వాళ్ళ అమ్మా నాన్నా కుదిర్చిన అమ్మాయి కనుక ప్రేమించాడా? యింత వ్యక్తిత్వం లేనివాడా నా కాబోయే భర్త?"

అని విసుక్కుంది. కొన్నాళ్ళు అయ్యాక మళ్ళీ విదేశీ కవరు రాకపోయేసరికి అనసూయ కూతుర్ని పిలిచి "నిరంజన్‌కు బదులు వ్రాసావాచిత్రా?" అనడిగింది. "ఆఁ" అని సునాయాసంగా చిన్న అబద్ధమాడేసింది చిత్ర. ఎన్నాళ్ళకూ జవాబు రాకపోయేసరికి "మనదేశంలో, ఎంగేజ్‌మెంటయిపోయినా జాబులు వ్రాసుకోడం మర్యాదకాదు కాబోలు, పొరపాటు చేశాను!" అనుకున్నాడు నిరంజన్.

అనుకోకుండా చిత్రజీవితం ఒక క్రొత్త మలుపు తిరిగింది. ఒక రోజు వై. యం. సి. ఏ.లో టేబిల్ టెన్నిస్ మేచ్ చూడ్డానికి స్నేహితులతో కలసి వెళ్ళింది చిత్ర. ఆ రోజు గెలుపొందిన ఆటగాడు జగన్మోహన్. 'ఎంత బాగా ఆడాడు; పేరుకు దగ్గ రూపం, ఏం చదువుతున్నాడో?' అనుకుంది యింటికి వస్తూ చిత్ర. నాలుగురోజుల తర్వాత యూనివర్శిటీ లైబ్రరీలో కనబడ్డాడు ఆ అబ్బాయి. ఎక్కడో చూచినట్లయి తిరిగి చూచాడు చిత్రవంక జగన్మోహన్. చిత్ర చిన్నగా నవ్వి "మొన్న మీ ఆట చూశాను. చాలా బాగా ఆడారు" అంది. జగన్మోహన్ సంతోషంగా "థాంక్యూ" అన్నాడు. ఆ తర్వాత వాళ్ళిద్దరూ అనేకచోట్ల తారసపడ్డారు. ఎగ్జిబిషన్‌లో, ఏదో పాట కచ్చేరిలో, చిత్రకళా ప్రదర్శనంలో– కనపడ్డప్పుడల్లా నవ్వుకోడం, 'హలో' అంటే 'హలో' అనుకోడం జరిగాయి. ఓనాడు ఆలిండియా రేడియో లలితసంగీత కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్ళిన చిత్ర, అక్కడకూడా జగన్మోహన్ ఎదురయ్యేసరికి ఆశ్చర్యపోయింది. చిత్ర నవ్వుతూ "ఏమిటండీ, ఎక్కడ చూచినా మీరేగా వున్నారు?" అన్నది.

మోహన్ మందహాసంగా "అంతేనా? ఎప్పుడూ మీరేగా వున్నారు నాకు" అన్నాడు.

చిత్ర కళ్ళు మెరిసాయి.

"ఇంతకీ మీరు రావడం–?" అన్నాడు మోహన్.

"రెండు భావగీతాలు పాడి వెళ్ళడానికి వచ్చాను. మీరు?" అనడిగింది చిత్ర.

"ఓ పావుగంట కుటీర పరిశ్రమల గురించి మాట్లాడానికి వచ్చాను" అన్నాడు. కనపడినపుడల్లా కవిత్వం మాట్లాడేవాడు జగన్మోహన్. ఒకరోజు చిత్ర తలంటుకుని, జుట్టు వదులుగా కట్టుకుని, తెల్లచీరతో, మల్లెపూలతో ముస్తాబయింది. మోహన్ పరవశంగా "చిత్రా ఎవరు నువ్వు, మహాశ్వేతవా?" అన్నాడు. ఇంకోరోజు తీరిగ్గా అలంకరించుకుని వెళ్ళిన చిత్రను చూసి, "వసంతుని దగ్గర వరం పొంది, ప్రకృతిలోని సౌందర్యాన్నంతా తనలో నింపుకుని, అర్జునిని తనవాణ్ణిగా చేసుకున్న చిత్రాంగదను టాగూర్ వర్ణించగా చదివాను; ఇవాళ కళ్ళారా చూస్తున్నాను" అన్నాడు. చిత్రగాలిలో తేలిపోయేది. తను గీసిన చిత్రాలతనికి చూపింది. సితార్‌లో గొంతు కలిపి అతనికి తనపాట వినిపించింది. చిత్రకళలో ఇంటీరియర్ డెకరేషన్‌లో ఆమె తీసుకున్న డిప్లమాలు చూసి జగన్మోహన్ అభినందించాడు చిత్రను. ఓనాటి సాయంత్రం సంధ్య వెలుగులో హఠాత్తుగా జగన్మోహన్ చిత్ర చేతులు పట్టుకుని, "నువ్వు ఎదుటలేని క్షణం యుగంగా వుంది నాకు. నీ సాహచర్యం ఎప్పుడూ కావాలి నాకు. యిస్తావా చిత్రా?" అన్నాడు ఆశగా. చిత్ర మైమరచిపోయింది. వుత్సాహంగా "నీకొక్కవాలేగాని, నా సర్వస్వం నీది మోహన్" అంది.

ఆ తర్వాత నాలుగురోజులకు చిత్ర తండ్రి గదిలోకి వెళ్ళి "నాన్నా!" అంటూ పలుకరించింది. "ఏమిటమ్మా." అన్నాడు ఆనందరావు. "నేను నిరంజన్‌ను చేసుకోను నాన్నా; రామ్మూర్తిగారికి ఉత్తరం వ్రాసెయ్యండి" అంది. ఆనందరావు నిర్విణ్ణుడు ఐనాడు "ఏమిటమ్మా నువ్వనేది? ఏం జరిగింది? నిరంజన్ ఏమైనా అసభ్యంగా వ్రాశాడా? లేక నీ జాబుకు బదులు వ్రాయలేదా? ఏం జరిగిందమ్మా అసలు" అన్నాడు.

చిత్ర నేలవంక చూస్తూ, నాకు నిరంజన్ అంటే యిష్టం కాలేదు నాన్నా; నాక్కావలసిన వ్యక్తిని నేనే వెతుక్కున్నాను" అనేసి లోపలకు వెళ్ళిపోయింది. అడుగుదూరంలో పిడుగుపడ్డట్లయింది ఆనందరావుకు.

కూతురి గదిలోకి వెళ్ళి, "చిత్రా! యీ సంగతి యిదివరకే ఎందుకు చెప్పలేదు మరి?" అనడిగాడు కోపంగా.

"జగన్మోహన్, యీ మధ్యనే పరిచయ మయ్యాడు నాకు. చూడండి నాన్నా! మీకూ్కడా నచ్చుతాడు. నిరంజన్‌కన్న ఎన్నో రెట్లు మెరుగైనవాడు." అంది.

ఆనందరావుకు అసహ్యమేసింది.

"చిత్రా! నీకు ప్రధానమైపోయింది. పదిమంది ఎదుట తాంబూలాలు పుచ్చుకున్నాం. ఆలోచించు. మెరుగైన వస్తువు మనది కానప్పుడు అభినందించాలే తప్ప, మనది కావాలనుకోడం తప్పు చిత్రా!" అన్నాడు.

"మోహన్ ఎవరివాడూ కాడు నాన్నా! నన్ను మనసారా కోరాడు. మీ పరువుకోసం. మర్యాదకోసం, నా మనసు, నా ప్రేమ? నావ్యక్తిత్వం, నా సంతోషం అన్నింటినీ చంపుకోవలసిందేనానాన్నా?" అన్నది ఆవేశంగా.

ఆనందరావు ఒక నిముషము ఆగి, "మీ అమ్మతో చెప్పావా చిత్రా!" అనడిగాడు.

"అమ్మ నన్నర్థం చేసుకోలేదు నాన్నా; మీరు నచ్చచెప్పండి." అంది చిత్ర!

"తొందరపడకు చిత్రా' ఆలోచించు." అని దిగులుగా వెళ్ళిపోయాడు ఆనందరావు.

ఆ రాత్రి ఎంతకీ నిద్రపట్టని చిత్ర ఏదేనా పుస్తకం తెచ్చుకుందామని తండ్రి గదిలోకి వెళ్ళింది. బల్లమీద రామ్మూర్తి అడ్రసువున్న కవరుచూసి, వుత్తరం తీసి చదివింది. ఆనందరావు - రామ్మూర్తికి! "నా భార్య ఆరోగ్యం యీ మధ్య బాగుండడం లేదు కనుక, సాధ్యమయినంత త్వరలో సెలవకు ప్రయత్నించి, నిరంజన్‌ను తీసుకుని వస్తే, చిత్ర పెండ్లి త్వరగా జరిపించాలని వున్న"దని వ్రాశాడు. చిత్ర ముఖం ఎఱ్ఱ

జారింది. 'నన్ను మోసం చేస్తావా నాన్నా!' అనుకుంది. పదోనాటికిఆనంద రావుకు రామ్మూర్తి దగ్గరనుంచి బరువైన కవరు వచ్చింది.

'డియర్ ఆనందూ!

నీ వుత్తరం, మీ అమ్మాయి వుత్తరం ఒకరోజే చేరాయి. ఆనాడే నిరంజన్‌కుకూడ చిత్ర జాబు వచ్చిందట. ఆ వుత్తరాలన్నీ నీకే పంపి స్తున్నాను. వ్యాఖ్య అనవసరం.

నిరంజన్ నాకు 'చిత్రాంగద ఎవరినో ప్రేమించా నని వ్రాసిన సంగతి నిజమే అయితే. మనం చెయ్యగలిగిం దేమీ లేదు. అయినా నిజం కనుక్కోండి. నేను మీకు కష్టం కలిగించను.' అని వ్రాశాడు.

ఆనందూ? నిరంజన్ మాకు ఒక్కడే కొడుకు. రిటరైయ్యాక. మాకు కోడలు వచ్చాక, కొడుకుదగ్గరే వుండాలని ఆశపడ్డాము. కోడలుగా ఎటువంటి పిల్ల వస్తుందో నన్న భయం, నా కంటే, మీ చెల్లెలి కెక్కువ వుండేది. నీ ఒక్కగా నొక్క కూతుర్ని చూడగానే మా కల ఫలించిం దనుకున్నాం. మన రెండు కుటుంబాలూ ఒకటిగా స్థిరపడితే వార్ధక్యంలో మన కందరికీ హాయి అనుకున్నాను. మన పిచ్చిగాని పిల్లలంటే పూవరు వాజులు కాదు, మనిష్టం వచ్చినచోట పెట్టవచ్చనుకోడానికి! నేను కోలుకో డానికి మూడురోజులు పట్టింది. నీ బాధ నే వూహించగలను.

సానుభూతితో, స్నేహంతో —

నీ రామ్మూర్తి.

ఆనందరావుకు తన సర్వస్వమూ కోల్పోయినట్లయింది. ఉత్తరా లన్నీ భార్యకిచ్చాడు యిహ తప్పదన్నట్లు. అనసూయ ఏడ్చింది. కూతుర్ని తిట్టింది. చిత్ర తొణకలేదు. "అమ్మకు నాన్నకు యిప్పుడు కష్టంగానే వుంటుంది. కొన్నాళ్ళ తర్వాత, నేనూ మోహన్ యీ యింట్లోనే సంతో షంగా తిరుగుతుంటే అమ్మా, నాన్నా కోలుకోక ఏమిచేస్తారు." అను కుంది. ఆనాడే జగన్మోహన్‌తో చెప్పింది-వచ్చి తన తండ్రిని కలుసుకో మని. జగన్మోహన్ వూరి కెళ్ళి తల్లిదండ్రులకు చెప్పివస్తా నన్నాడు. చిత్రకారాత్రి నిద్రరాలేరు.

'నిరంజన్‌కు ప్రేమ వుందంటాడు; నాకేమీ కనపడలేదు. వుంటే మాత్రమేమి? వుండికూడా కట్టుకోని చీరల్లాగ, పెట్టుకోని నగలలాగ, అవ్యక్తమైన ప్రేమ నిరర్ధకమే." అనుకుంది.

ఇది జరిగిన కొద్దిరోజులకే యునెస్కో అధ్వర్యాన స్వీడన్‌లో జరిగిన ఇంటర్నేషనల్ సింపోజియానికి ఢిల్లీనుంచి వెళ్ళిన సత్యనారాయణ రామ్మూర్తిని కలుసుకోవడం జరిగింది. సత్యనారాయణ ఢిల్లీకి తిరిగివచ్చి కూతురిఫోటో పంపాడు రామ్మూర్తికి. నిముషాల్లో కుదిరిపోయింది సంబంధం. ఏకంగా లగ్నమే నిశ్చయించుకుని, పెళ్ళికే తరలివచ్చారు రామ్మూర్తి దంపతులు. మనసు లేకపోయినా స్నేహరీత్యా పెళ్ళికి వెళ్ళక తప్పిందికాదు ఆనందరావుకు. భార్యతో సహా వచ్చిన స్నేహితుణ్ణి చూసి మనస్ఫూర్తిగా సంతోషించాడు రామ్మూర్తి. "'పెళ్ళిళ్ళు స్వర్గంలో అవుతాయంటా రిందుకే!' సుపుత్వరగా ముహూర్తం పెట్టించు. ఆలస్యం చెయ్యక." అన్నాడు రామ్మూర్తి స్నేహితుడితో. అనసూయ చిత్రకు ప్రధానంలో పెట్టిన చీర, వుంగరం తెచ్చి, సుభద్రకిస్తూ "నీ కోడలుకు దక్కవలసినవి, నా కూతురికి వుంచుకోలేను వదినా." అంది. కళ్ళనీళ్ళు తిరగ్గా; పెండ్లికూతురికి బంగారు కుంకుమభరిణ బహూకరించింది అనసూయ. బరువైన మనసుతో తిరిగి వచ్చారు. వధూవరులు హనీమూన్‌కు హవాయికే వెళ్తున్నట్లు, అక్కడే నిరంజన్‌కు వుద్యోగం వచ్చింది కనుక వెళ్ళినవాళ్ళు వెళ్ళినట్లే స్థిరపడిపోతారని తల్లి చెప్పగా విన్నది చిత్ర.

.మోహన్ వూరినుంచి వస్తానన్న రోజుకు వెళ్ళి కలిసింది చిత్ర. మోహన్ గంభీరంగా వుండడం చూసి చిత్ర భయపడింది. గాభరాగా "మోహన్, ఏమి అట్లా వున్నావు? ఏమయ్యింది చెప్పవూ." అంది. జగన్మోహన్ సూటిగ చిత్ర కళ్ళలోకి చూస్తూ. "కలువరేకు ల్లాంటి నీ కళ్ళు చూసి, నీ మనసుకూడ కోమలమైందనుకున్నాను. చిత్రా, నన్నింతగా మోసం చెయ్యడం నీకు న్యాయమా? నువ్వు సౌందర్యనిధివేగావచ్చు; పురుషుడు స్త్రీ సౌందర్యానికి బానిసకావచ్చు; కాని నువ్వు నన్నింత లోకువ చేస్తావని నే నెప్పుడూ అనుకోలేదు." అన్నాడు.

చిత్ర తెల్లబోయింది. "మోహన్, ఏమిటి నువ్వనేది? నేను మోసం చేశానా నిన్ను? లేదు మోహన్, నిన్ను ప్రేమించాను నేను." అన్నది.

"హూఁ! ప్రేమ! యీ దేశములోనే కాదు. ఏ దేశంలోనైనా ప్రధానమైన తర్వాత స్త్రీకి ఇంకో పురుషుణ్ణి ప్రేమించే హక్కు లేదు. చిత్రా; నువ్వు పసిపిల్లవు కావు. యీ సంగతి తెలియకపోవడానికి? ఇన్నాళ్ళ మన స్నేహంలో! ఒక మాటైనా నాకు తెలియనిచ్చావా?" అన్నాడు.

చిత్రకు అంతా అర్థమైంది.

"మోహన్, నా మాటలను విను. ప్రధానమైన సంగతినిజమే....! అతణ్ణి నేను చూచింది అరగంట. అతడు నా కేమీ నచ్చలేదు. మనసుతో ప్రమేయం లేని ప్రధానంలో నాకు నమ్మకంలేదు. దానికి విలువలేదు. దాన్ని నేను సీరియస్‌గా తీసుకోలేదు. అందుకే నీకు చెప్పలేదు. నిన్ను మోసం చెయ్యాలన్న తలంపు నా కెన్నడూ లేదు. మోహన్, నమ్మవా నువ్వు?" అంది.

జగన్మోహన్ నవ్వుతూ "నీయంత స్పోర్టివు నువ్వేగాని, నేను కాదు చిత్రా! ప్రధానమైన వెనుక మనం పెళ్ళాడితే, లోకం ఏమంటుంది? 'ఆ పెళ్ళి వా ళ్ళెందుకు వదులుకున్నారు? యీ పెళ్ళి ఎట్లా జరిగింది? ఏదైనా గ్రంథం జరిగిందేమో,' ననుకోరా? అంతకన్నా తలవంపులు ఇంకోటి ఉందా? చిత్రా, పెళ్ళిపీటలమీద పెళ్ళికూతుర్ని ఎత్తుకుపోయి పెళ్ళాడ్డానికి నే నేమి కథల్లోని హీరోనికాను." అన్నాడు.

చిత్ర తెల్లబోయింది. "లోకం! ఇంత చదువూ, సంస్కారం వున్న నువ్వుకూడా లోకానికి దడుస్తావా మోహన్" అంది. "చదువు, సంస్కారం వుంది కనుకనే తప్పుచెయ్యడానికి వెరపువుంది నాకు. చిత్రా, నాది కాని వస్తువు ఎంత సుందరమైనా కాని, దాన్ని తాకడానికి నా అంత రాత్మ ఒప్పదు" అన్నాడు.

"మోసపోయింది నువ్వుకాదు మోహన్, నేను!" అనుకుంది చిత్ర.

మోహన్ జాలిగా జూచాడు. "నీకు కష్టంగా వుందికాని చిత్రా, నిన్ను వదులుకోడానికి అంతకన్న ఎక్కువ బాధపడ్డాను నేను. నీ సౌందర్యాన్ని, నీ కళాహృదయాన్ని ఎంతగా ఆరాధించాను! మబ్బుల్లోంచి రంగులు ఏరి నిన్నుచిత్రించుకున్నాను నా హృదయంలో! నా చేతులతో నేనే దాన్ని చెరిపేసుకోడానికి ఎంత బాధపడ్డానో ఎలా చెప్పను? మర్చిపోయా నింకోసంగతి! నా పెళ్ళి బహుశః వచ్చేనెల్లోనే కావచ్చు. మా అమ్మ చెప్పిన సంబంధానికి సమ్మతి తెల్పివచ్చాను. జరిగింది మర్చిపో. నువ్వు పెండ్లికిరా. నీ పెండ్లికి శుభలేఖ పంపు. నేను తప్పక వస్తాను. స్నేహితుల్లాగానే విడిపోదాం" అన్నాడు బరువుగా.

"అతనికి పెండ్లి అయిపోయింది" అని చెప్పబోయి వూరుకుంది చిత్ర. 'ఇత డేమవుతాడు నాకు, సానుభూతి కోరడానికి?' అనుకుంది. కుతూహలము అణచుకోలేక "పోనీలే మోహన్, సంతోషం. నీక్కా-బోయే భార్య అందమైనదేనా?" అనడిగింది.

జగన్మోహన్ విచారంగా నవ్వి "నేను చూడనేలేదు చిత్రా. మా అమ్మ 'ఫరవాలేదురా, సంసారపక్షంగా, వుంటుంది,' అన్నది. 'సరే నన్నాను," అన్నాడు.

చిత్ర నిర్ఘాంతపోయింది, ఆ తర్వాత కాసేపటికి ఎవళ్ళిళ్ళకి వాళ్ళు వెళ్ళిపోయారు.

చిత్ర మెట్లెక్కి- మేడమీద తనగదిలోకి వెళ్తుంటే, హాల్లో కూర్చుని వున్న అనసూయ, కూతురు ఎక్కడికెళ్ళి వచ్చివుంటుందో వూహించుకుని, కూతుర్ని పిలిచి "నువ్వు ప్రేమించినవాడి పేరూ, వూరూ చెప్పమ్మా త్వరగా పెళ్ళిచేస్తాం. ఇంకెంతగా నవ్విస్తావు మమ్మ ల్నీ లోకంలో!" అంది.

చిత్ర మనసు బండబారిపోయి వుంది. "ఇహ నా పెళ్ళి సంగతి ఎత్తొద్దమ్మా, నేను పెళ్ళిచేసుకోను," అంది.

అనసూయకు ఒళ్ళు మండిపోయింది. "ఏం, ఎవడో వున్నాడన్నావుగా, ఏమయ్యాడు వాడు?" అన్నది కోపంగా.

చిత్ర భయపడలేదు. మొండిగా తల్లి వంకచూస్తూ "అతనికి వచ్చే నెల్లో పెళ్ళట! వాళ్ళమ్మ ఎక్కడో కుదిర్చారట. ఆ పెళ్ళికి ఒప్పుకున్నాడట!" అంది.

ఆ సంగతి విన్న అనసూయకు కూతుర్ని చూస్తేనే అసహ్యమేసింది. "అందరికీ వుంటారు అమ్మా, నాన్నా; నీకుమాత్రం లేరు చిత్రా, మేం చచ్చిపోయాం నీకు! వెళ్ళు, నాయెదుట నిలబడకు!" అన్నది.

ఆ రోజునుంచి అనసూయకు అప్పుడప్పుడు ఫిట్సు రావడం మొదలెట్టినయి.

ఆ తరవాత యింట్లో ముగ్గురూ కూర్చుని కబుర్లాడుకోవడం, నవ్వులాడుకోవడం జరగలేదు. చిత్ర కాలక్షేపానికి పెయింటింగు స్కూల్లో టీచరుగా చేరింది. అప్పుడప్పుడు చిత్రాలుతీసి ప్రదర్శనాలకు పంపుతుండేది స్నేహితుల ప్రోత్సాహంతో. రెండు మూడుసార్లు బహుమతులు వచ్చాయి. బహుమతి అందుకోడానికి ఢిల్లీ వెళ్ళింది ఒకసారి. తల్లిగాని, తండ్రిగాని వెంట వెళ్ళలేదు. ఓ రోజు స్కూలునుంచి తిరిగి యింటికి వచ్చేటప్పటికి తండ్రితో ఎవరో మాట్లాడుతున్నారు. చిత్రను చూసి "మనమ్మాయేనా? ఏం చదువుతోంది?" అనడిగా డాయన. ఆనందరావు "చదువు పూర్తయింది. సరదాకు అమూర్త చిత్రాలు గీస్తుంటుంది." అన్నాడు. అందులోని వ్యంగ్యానికి చిత్ర మనసు గాయపడింది. రోజూ భోజనాల దగ్గర ముగ్గురూ కలుసుకోవడం, దగ్గర కూర్చోడం. భోంచేసేప్పుడు ఏం మాటలు జరగవు. చిత్ర వడ్డించుకొని గిన్నెలు జరిపితే, తల్లి, తండ్రి వడ్డించుకుంటారు. 'ఇంకా స్త కూర వేసుకో, అదేమిటప్పుడే అయిపోయిందా' అని తల్లి కూతురితో అనడంలే దిప్పుడు. ఓనాడు సాయంత్రం లాన్‌లో కూర్చుని ఏదో ఎంబ్రాయిడరీ చేస్తోంది చిత్ర. ఆనందరావు ఏదో రస్సెల్ పుస్తకం చదువుకుంటున్నాడు. అనసూయ

పూలు కడుతోంది, డ్రాయింగు రూములోని నటరాజ విగ్రహానికి వేయ డానికి. ఆనందరావు పై పిస్తు, కృష్ణ వచ్చాడు.

"ఏమిటోయ్," అన్నాడు ఆనందరావు.

కృష్ణ బిడియంగా "అర్జంటుగా యిరవై రూపాయలు కావాలండీ, మా అమ్మకు ఇంజెక్షన్లు కొనాలి," అన్నాడు. ఆనందరావు వెంటనే లోపలికివెళ్ళి డబ్బు తెచ్చిచ్చాడు. కృష్ణ వెళ్ళిపోగానే ఆనందరావు భార్యకు చెప్తున్నట్లుగా "యీ అబ్బాయి చూడు, యస్సెస్సెల్సీ పాస యాడు. డబ్బులేక పై చదువులు చదవలేదు. పైపుపరీక్షలుపాసై, పన్నెం డేళ్ళగా సంపాదిస్తున్నాడు. యింట్లో రోగిష్టితల్లీ, ఒక విధవ అక్కా, ఆమె పిల్లలు ముగ్గురూ, ఒక తమ్ముడూ వున్నారట. మా ఆఫీసులో అత డికి వచ్చే జీతంతో యిల్లు గడవక, రాత్రిళ్ళు మార్వాడీదగ్గర పద్దులు వ్రాసి పాతికో, ముప్ఫయ్యో తెచ్చుకుంటాడట. ముప్ఫయ్యేళ్ళుంటాయి. పెళ్ళిరాలేదు." అన్నాడు. చిత్ర నిర్విణ్ణురాలయింది. "లోకంలో తల్లి దండ్రులు, స్వజనంకోసం ఎంతెంత త్యాగాలు చేసేవాళ్ళున్నారు! వాళ్ళ త్యాగానికి గుర్తింపు వుండదని తెలిసినా కష్టపడతారు! తనకూ ఆ అబ్బా యికీ ఎంత తేడా?" అనుకుంది.

ఓరోజు అనసూయ వంటింట్లో పని చూసుకుంటూంది. వంట మనిషి కూతురిపెళ్ళి చెయ్యాలని సెలవపెట్టి వెళ్ళాడు. ఆ క్రిందటిరోజే అనసూయ భర్తను కదిపింది, చిత్రకు సంబంధాలు వెతకమని. ఆనంద రావు తెల్లబోయి, "ఆ అర్హత పోగొట్టుకుంది అనసూయా, ఎప్పటికైనా చిత్ర తనపెళ్ళి తను చేసుకోవలసిందే! నీకు తెలుసుగదా! ప్రధానమైంది ఒక మనిషితో, పార్కులవెంబడి తిరిగింది యింకోమనిషితో! ఏ ధైర్యంతో నేను తల ఎత్తుకుని ఎవరి గుమ్మంలోకైనా అడుగుపెట్టి 'అమ్మాయినిస్తా'నని అనగలను!" అన్నాడు.

అనసూయకు తల తిరిగినట్లయింది. స్పృహలేకుండా పడిపో యింది. ఆనందరావు వచ్చి భార్యను లేవదీసి పడుకోబెట్టి ప్రక్కనకూర్చు న్నాడు. నౌకరు కబురుచెప్పగా విని చిత్ర వెళ్ళిందక్కడకు. ఆనందరావు

కూతుర్నిచూసి "ఏమీలేదు, నువ్వెళ్ళమ్మా!" అన్నాడు. చిత్రకు తండ్రి తన తల్లిని ఎంతగా ప్రేమించాడోతెలుసు. తనకారణంగాఆమె ఆరోగ్యం దెబ్బతినగా, తండ్రి తనను క్షమించలేడనుకుంది. గుఱ్ఱప్పందాల్లో పోయింది పోగా, యింట్లో యినప్పెట్టెలో డబ్బుకూడా దొంగలపాలయి నట్లుగా వుంది చిత్ర పరిస్థితి! రుద్ధకంఠంతో "నేనంటేఎంత అసహ్యంగా వుంది మీకు! నామీద మీకున్న ప్రేమంతా చచ్చిపోయిందా నాన్నా?" అంది.

ఆనందరావు నిర్లిప్తంగా చూచాడు. "ఎంత చెడ్డా సంతానంమీద ప్రేమ చంపుకోలేకపోవడం, జన్మ నిచ్చినవాళ్ళకు బ్రహ్మ యిచ్చిన శాపం! ఆ భయం నీకక్కరలేదు చిత్రా," అన్నాడు. చిత్ర సిగ్గుతో తల వంచుకుంది. ఆనందరావు కూతుర్ని చూస్తూ, "నీ తల్లి నిన్నెంతగా ప్రేమించిందో నీకు తెలియదు చిత్రా! నువ్వనుకోవచ్చు, ఏ తల్లి తన బిడ్డను ప్రేమించదని! అనసూయ పిచ్చిది. జీవితంలో నువ్వుతప్ప ఇంకో ఆశా, వ్యామోహం లేకుండా, ఆపేక్షంతా నీమీద కురిపించింది. నీకు తెలీదు; నీకోసం ఎంత ఆరాటపడేదో? నా తోటి ఆఫీసర్లు ఎట్లా బ్రతుకు తున్నారో నాకు తెలుసు. వాళ్ళిళ్ళల్లో అయ్యేఖర్చుకు పదిరెట్లవుతుంది మనింట్లో. వాళ్ళలో చాలమంది యిళ్ళు కట్టుకున్నారు. పిల్లల పెళ్ళిళ్ళు చేసుకున్నారు. పెద్దపెద్ద సంసారాలను పోషిస్తున్నారు. ఏ బాదరబందీ లేక పోయినా, నేను పైసా మిగల్చలేదు. మీ అమ్మతో అన్నాను చాలాసార్లు, 'రిటయిరయితే మనం వుండడానికి యిల్లు కావాలికదాని.' మీ అమ్మ అనేదికదా 'చిత్ర పెళ్ళి జేసేద్దాం. అది ఎక్కడికో వెళ్ళిపోతుంది.అప్పుడు మనకెంత చిన్న యిల్లయినా చాలునని.'

ఓ రోజు నువ్వు వుత్సాహంగా యింటికి వచ్చి మీ లేడీస్ క్లబ్ నుంచి ఇరవైమంది నైరోబి వెళుతున్నారని, నీకూడా వెళ్ళాలనుందని చెప్పావు. ఆ వెళ్ళేవాళ్ళందరూ సంపన్నుల యింటి స్త్రీలే! మన తోటివాళ్ళెవరూ లేరు. నా దగ్గర డబ్బు లేదన్నాను. మీ అమ్మ వినలేదు. డబ్బు సమకూర్చి నిన్ను పంపింది. ఆ తర్వాత మీ అమ్మ రవ్వల కమ్మలు

పెట్టుకోగా, చంద్రహారం వేసుకోగా నువ్వు చూశావా? ఆ రెండూ నీ విదేశయాత్ర కయిపోయాయి. ఆతీరుగా నిన్ను పెంచినందుకు, నీనుంచి మేము కోరిన ప్రతిఫల మేమిటి? నీ సుఖం చూచి సంతోషించా లను కోడం! ఇంకోరోజు గుర్తుందా నువ్వు కాలేజినుంచి వచ్చి నీ స్నేహితు రాలు రంజనజాబు వచ్చిందని చెప్పావు. రంజన ఎయిర్ హోస్టెస్‌గా చేరి ఒక ఏడాదిలో దేశదేశాలు తిరిగివచ్చిందని చెప్పి 'నేను వెళ్తానమ్మా ఎయిర్ హోస్టెస్‌గా' అన్నావు.

"రంజన జాబు చిత్రకు గుర్తువచ్చింది."

రంజన ఏం వ్రాసింది? "నువ్వు తప్పక అప్లయి చెయ్యి. నీ ఫిగర్‌కు. నీ యింగ్లీషుకు, నీకు రాకపోతే యింకెవరికి వస్తుంది వుద్యోగ మని!' మీ అమ్మ ఏమన్నది? 'విదేశాలు చూడాలంటే, దేశాలు తిరిగే వాణ్ణి చూసి పెళ్ళి చేస్తాం. అంతేకాని నువ్వేర్ హోస్టెస్ కానక్కర లేదు' అని, ఆ తర్వాత నాతో చెప్తుండేది. విదేశాల్లో ఉద్యోగంలో వున్న అబ్బాయికోసం వెదకమని! నీకు కుదిర్చిన సంబంధం మనకు రావలసింది కాదసలు రామ్మూర్తి స్నేహరీత్యా ఒప్పుకున్నాడు కాని! నువ్వు వాళ్ళింటి కోడలుగా వెళితే, చివరిరోజుల్లో, యీ వయసులో మా కెంత మన శ్శాంతిగా వుండేది? మాకు నీలాగ బొమ్మలు గీయడం రాదు కానీ, నీ సుఖంగురించి, నిన్ను చూచి సంతోషించీ, మా భవిష్యత్తుగురించీ మేము మా మనసుల్లో చిత్రించుకున్న చిత్రాలకన్నా, నువ్వు గీసిన చిత్రాలు అందమైనవి కావు చిత్రా! ఒక్క బొమ్మలేకుండా, తుడిచిపెట్టుకుపోతే, జీవిత మంతా శూన్యంగ తోస్తోంది మా" కన్నాడు.

అనసూయ నెమ్మదిగా కళ్ళు తెరిచింది. చిత్ర హార్లిక్సు కలిపి తల్లికి యిచ్చి తనగదిలోకి వెళ్ళింది. అప్పుడే వస్తున్న స్నేహితురాలిని చూసి; నీరజాక్షి వస్తూనే "చిత్రం పూర్తయిందా చిత్రా" అనడిగింది చివరి టచెస్‌కూడా పూర్తిచేసిన చిత్రాన్ని చూపించింది చిత్ర. "ఎల్లుండే ఆర్ట్ ఎగ్జిబిషన్‌కు పంపడానికి. ఫ్రేము వేయించి పంపు." అన్నది. నీరజాక్షి కొడుకు, నాలుగేళ్ళ మహేష్ క్రిందకు దిగి ఆడుకుంటున్నాడు.

వాడి కేమితోచిందో ఓ క్షణాన! ప్రక్కనేవున్న రంగులన్నీ తీసి పూర్త యిన చిత్రంమీద ప్రయోగించాడు. వెనుతిరిగి చూచిన నీరజాక్షిముఖం పాలిపోయింది. చిత్ర తెల్లబోయింది. నీరజాక్షి కోపంకొద్దీ కొడుకుని గట్టిగా రెండు దెబ్బలు వేసింది. వాడు ఏడ్చాడు. చిత్ర చప్పున వాడి నెత్తుకుని లాలిస్తూ "వాణ్ణి కొట్టకు నీరజా! నేను చేసిన పాపంముందు, యీ చిన్నబిడ్డ చేసిన తప్పెంతటిది?" అన్నది. నీరజాక్షి కర్థంకాక తెల్ల బోయింది.

—o—